క్లుప్తంగా

25న భారీ సంగీత కార్నివాల్

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో ఈనెల 25వ తేదీన ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జానపద కళ మెగా సంగీత కార్నివాల్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యుడు అబ్దుల్ సలామ్ మంగళవారం తెలిపారు. సంగీత కార్నివాల్‌లో దాదాపు 60 సంవత్సరాల క్రితం నాటి సంగీత వాయిద్య పరికరాలతో 50 మంది కళాకారులు అంతరించిపోతున్న భారత ప్రాచీన సంగీత కళలను ప్రదర్శిస్తారని వివరించారు. కార్నివాల్ రికార్డులను గుర్తించేందుకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. దేశంలోనే భారీ జానపద కళా మెగా సంగీత కార్నివాల్‌గా నిలవబోతున్నదని స్పష్టం చేశారు. కళాకారులు, కళాభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాల నిషేధ చట్టాలపై అవగాహన

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.అనురాధ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, జీవోఎంఎస్ 31పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం సాంఘిక దురాచారమన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ఉండడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బాల్యవివాహాల నిషేధ చట్టాలు, ఫోక్స్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.శ్రీలత, శేషకుమారి, విన్యాసమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలులో ఇబ్బందులు నివారించండి



వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూజెండ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కరెంటు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇర్లపాడులో ప్రత్యేక వైద్యశిబిరం



శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో జ్వరాలు ఉన్నాయని గ్రామస్తుల సమాచారంతో వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర పీడితులు నివాస గృహాలను సందర్శించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు అందజేసి సూచనలు చేశారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తమవంతు బాధ్యత వహించాలని వైద్యాధికారి కోరారు. గ్రామంలో పంచాయతీ వారి సారథ్యంలో మురుగు కాల్వల్లో శానిటేషన్ పనులు కూడా చేయించారు. అనంతరం జ్వరపీడితుల నివాస గృహాలను సందర్శించి ఆరోగ్య సూత్రాలు వివరించి మందులు అందజేసి రిపోర్టులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, పంచాయతీ కార్యదర్శి కోమిటినేని అశోక్ చౌదరి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అమర లింగేశ్వరి, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

యడ్లపాడు: ఎన్నికల విధులను రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో సకాలంలో నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.నారదముని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా చిలకలూరిపేటలో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయనను యడ్లపాడు మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు కేఏ చారి, కార్యదర్శి ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్యామల, ఆర్‌ఐ ఎం.చక్రవర్తి, సీనియర్ సహాయకులు మోజేస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఈపూరు

ఒకప్పుడు ఈపూరు ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. ఓట్ల కోసం మాత్రమే వచ్చి.. తరువాత ముఖం చూపని పాలకులు, నిధులు లేక స్పందించని యంత్రాంగం.. ఇవే ఈ ప్రాంతాన్ని ముందుకు నడిపించ లేకపోయాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. జగనన్న పాలనలో ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. పాఠశాలలు, ఆర్బీకేలు, సచివాలయాలు ఇలా ఒకటేమిటి.. ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా నిలుస్తోంది ఈపూరు.

- చేతల్లో చూపించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఎక్కడ చూసినా పక్కా భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు



నూతనంగా ఏర్పాటు చేసిన పక్కా భవనంలో ఎంపీడీవో కార్యాలయం

ఈపూరు: అభివృద్ధి అంటేనే వైఎస్సార్ సీపీ. ఎక్కడ చూసిన పక్కా భవనాలతో ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కనిపిస్తుంటాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పాడుపడ్డ భవనాలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను నడిపేవారని, అందుకు విభిన్నంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసి చూపించారు. మండలంలో గత పాలకులకు చేత కాని పనిని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పట్టువిడువని విక్రమార్కుడిలా ప్రభుత్వంలో తన పలుకుబడిని ఉపయోగించారు.

రూ.6 కోట్లతో ప్రభుత్వ వైద్యశాలను నూతన హంగులతో నిర్మిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ తన హయాంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.కోటి రూపాయలతో పక్కా బిల్డింగ్ నిర్మించారు. ప్రస్తుతం మండల పరిషత్ అభివృద్ధి కార్యకలాపాలు నూతన భవనంలో సాగిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి మోడల్ స్కూల్ నిర్మాణానికి స్థలం దొరక్క చాప సంకన పెట్టుకొని స్థలం కోసం ఊరూర అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరుగుతుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 15 రోజుల్లోనే స్థలాన్ని సేకరించి సుమారు రూ.4 కోట్ల నాడు–నేడు నిధులతో వనికుంట వద్ద మోడల్ స్కూల్ నిర్మాణం చేపట్టారు. అలాగే అంగలూరు, కొండ్రముట్ల వద్ద సొసైటీల సహకారాలతో పెట్రోల్ బంక్‌లు, 12 గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లు నెలకొల్పి ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నారు. అలాగే గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్లు తొలగిస్తే నేడు పార్టీలకు,





ఈపూరులో రూ.6 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్యశాల

కులమతాలకు అతీతంగా రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతిపేద వాడికి పింఛన్లు అందిస్తున్నారు. అలాగే ప్రతి గ్రామంలో వైఎస్సార్ హౌసింగ్ స్కీం కింద స్థలాలు మంజూరు చేయించారు. ఇలాంటి అభివృద్ధి రాష్ట్రంలో ఇదే తొలిసారిగా జరిగిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మరలా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రతి పల్లె పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇది చేతల ప్రభుత్వం



ఇప్పటివరకు నేను నాలుగు ప్రభుత్వాలు చూశా. నలుగురు ఎమ్మెల్యేలు మారారు. ఎన్నికల ముందు మాటలు చెబుతారు. ఓడిపోగానే ఇంటికి పోతున్నారే తప్ప. ఎన్నికల ముందు ఇచ్చిన మాటలను తూ.చ.తప్పకుండా చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మునుపెన్నడూ చూడలేదు. ఒక్క ఈపూరు గ్రామంలోనే రూ.8 కోట్ల పనులు జరిగాయి. ఇక మండలానికి చూస్తే ఏ మేరకు ఉంటుందో చెప్పే పని లేదని, కనుక అభివృద్ధి చేసే ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలే మాకు కావాలి. పనిచేయని నాయకులు మాకు వద్దు.

–పడిగ బాలయేసు,
టీ కొట్టు యజమాని, ఈపూరు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్, రూరల్ పోలీస్ స్టేషన్‌లైన్, మద్ది మల్లయ్య వీధి, మారెళ్లవారివీధి ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆర్బీకేల్లో క్వింటా కందులు రూ. 9600 కొనుగోలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో రైతులు సాగు చేసిన కంది పంటను ప్రభుత్వ మద్దతు క్వింటా ధర రూ. 9600 రూపాయలకు కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు కొనుగోలు పారదర్శకంగా జరుగుతుందన్నారు. ప్రస్తుతం కంది పంట కోత దశలో ఉందని రైతులందరూ రైతుభరోసా కేంద్రాల్లో అమ్ముకోవాలన్నారు. గోనె సంచులు కూలీల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి ప్రభుత్వమే నేరుగా రైతుభరోసా కేంద్రాల ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి కంది పంటను కొనుగోలు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈవో పురేటి అశోక,రైతుభరోసా సహాయకురాలు వెంకయమ్మలు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బొల్లా జన్మదినోత్సవం

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన కుటుంబ సభ్యులు
- 5 వేల మంది కార్యకర్తలతో భారీ బైకు ర్యాలీ
- ముఖ్య అతిథిగా హాజరైన నర్సరావుపేట వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): శాసనసభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదిన వేడుకలు వినుకొండలో అంబరాన్నంటాయి. ఈసందర్భంగా పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయం, శ్రీనివాసనగర్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మర్యాదలతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఘనస్వాగతంతో ఆహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. స్వామివార్లకు లక్ష తులసీ ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేశారు.

భారీ బైక్ ర్యాలీ

ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలకు నరసరావు పార్లమెంట్ అభ్యర్థి అనీల్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా, యువ నాయకులు గిరిబాబుతో పాటు భారీ సంఖ్యలో అనీల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. 5 వేల బైకులతో భారీ ర్యాలీ చేపట్టారు 5 కిలోమీటర్లు దూరం బైకు ర్యాలీ చేశారు. వేలాది మంది కార్యకర్తలు తరలి రావటంతో గుంటూరు కర్నూలు హైవే జనసంద్రంలా మారింది. అడుగడుగునా నాయకులకు ఘన స్వాగతం పలికారు. విఠంరాజుపల్లి బాలాజీ ఎస్టేట్, పట్టంలోని శివయ్యస్తూపం, రైల్వేస్టేషన్ రోడ్లలో, ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పి.ఎస్.ఖాన్, పార్టీ నాయకులు, కల్యాణయూత్‌లతోపాటు అభిమానులు క్రేన్ల సాయంతో భారీ గజమాలలు వేసి బాణాసంచా కాలుస్తూ పూల వర్షం కురిపించారు. ఎమ్మెల్యే బొల్లా, ఎంపీ అభ్యర్థి అనీల్‌కుమార్ యాదవ్‌లకు ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేత

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదినం సందర్భంగా పట్టణంలోని 23వ వార్డులో గల ఎంపీపీ స్కూల్‌లో వార్డు ఇన్‌చార్జి అద్దంకి గౌస్‌బాషా ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రెడ్డిగూడెం ఇలియాస్, ముల్లా మాము, ఖాజామీయా, షబ్బీర్, వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టరు పాలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్‌కు మండలంలోని గంటావారిపాలెం గ్రామం నుంచి కనమర్లపూడి వరకు 500 బైకుల ర్యాలీతో ఘన స్వాగతం కార్యకర్తలు అభి మానులు మండల గ్రామస్థాయి నాయకులు ఘన స్వాగతం పలికారు. కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలు అభిమానులు ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌తో సెల్ఫీలు దిగడానికి కదం తొక్కారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, అనిల్‌కుమార్ యాదవ్‌లు, కార్యకర్తలు అభిమానులకు అభివాదం చేస్తూ ప్రచార రథంపై వినుకొండ వైపు పయనం అయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు ఎమ్మెల్యే తనయుడు బొల్లా గిరిబాబు, సర్పంచ్ తన్నీరు భారతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ అధ్యక్షులు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ భీమని అంకారావు, బీసీ సంఘం నేతలు స్వర్ణాల వెంకటరావు యాదవ్, చిన్నాబ్బాయి యాదవ్, తన్నీరు అంకారావు, సీఐ సాంబశివరావు, ఎస్సైలు చల్లా సురేష్, కత్తి స్వర్ణలత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జగనన్నది సుపరిపాలన

వినుకొండ(నూజెండ్ల): ప్రతిగ్రామంలో గ్రామపరిపాలన విధానాన్ని తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. అదేవిధంగా వల్లేరు వాగుపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జి నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు.



కనమర్లపూడిలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్



వల్లేరు వాగుపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

లింగముక్కపల్లిలో నూతన సర్పంచ్ ప్రమాణస్వీకారం

నూజెండ్ల మండలంలోని లింగముక్కపల్లి గ్రామ నూతన సర్పంచ్ ఉప్పు లక్ష్మీ గోవిందరాజులు ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, శేషయ్య, తన్నీరు ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష - జగనన్న సురక్ష

- వేర్వేరు గ్రామాల్లో కొనసాగుతున్న వైద్యశిబిరాలు
- ఉచితంగా మందులు పంపిణీ
- మెరుగైన వైద్యం కోసం ఇరువురు జీజీహెచ్‌కు రిఫర్

నాదెండ్ల: అనారోగ్య సమస్యలతో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. ఇర్లపాడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం సర్పంచ్ మంగు రమాదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.ప్రసాద్ నాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ దత్తశ్రీ, జనరల్ మెడిసన్ డాక్టర్ సంఘవి, బి.జ్ఞానేంద్రరావు పాల్గొని 405 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. వీరిలో కంటి, కడుపులో సమస్యలతో బాధపడుతున్న ఇరువురిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో విడతల వారీగా వైద్య క్యాంపులు నిర్వహించి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి 15 రోజులకొకసారి ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో మంచానికే పరిమితమైన వారికి ఇళ్లవద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మందుల కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, గణపవరం, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ బాషా, మండల కో ఆప్షన్ మెంబర్ మూసామసీద్, నాయకులు కె.రామకృష్ణ, జోజిబాబు, ఏఎన్‌ఎంలు, ఆశలు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.



ఇర్లపాడులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీవో కవితాచౌదరి

శానంపూడిలో..

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సారథ్యంలో ఏర్పాటు చేసిన ఇలాంటి వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 403 మందికి వైద్య సేవలు అందించి 14 రకాల వైద్య సేవలు పారదర్శకంగా అందేలా వైద్యాధికారులు బాధ్యత వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వంశీనాథ్, అజిత, శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముండ్రు మనోహర్, సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, ఆరోగ్య కార్యకర్తలు మస్తాన్‌బీ, శ్రీలలితా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలకు అవగాహన

ఈపూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో అరుణ, కొచ్చర్ల పీహెసీ డాక్టర్ బి.నాగేంద్రబాబు, ముప్పాళ్ల పీహెచ్‌సీ డాక్టర్ బి.నవీన్‌లు హాజరై మాట్లాడుతూ పీసీపీఎన్డీటీ యాక్ట్ 1994లో వచ్చిందని, దాని ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు నేరమని, 3 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. ఆడపిల్లలను చదివించాలని, వారిని స్వేచ్ఛగా మగవారితో సమానంగా పెంచాలన్నారు. బాల్య వివాహాలు చేసిన వారిపై చట్టపరంగా శిక్షలు పడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.చెంచయ్య, కొచ్చర్ల వైద్యసిబ్బంది టి.లక్ష్మీనరసమ్మ, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. ఆ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రెడ్డిపాలెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ దుద్దుకుంట నారాయణరెడ్డి సంతాప సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ కాశినేడి మస్తానయ్య, మాజీ సర్పంచ్‌లు గెల్లి చినకోటిరెడ్డి, చీమల శ్రీనివాస రెడ్డి, కొత్తపల్లి ఉపసర్పంచ్ ఇగుటూరి రంగారెడ్డి, ముచ్చుమారి వెంకటేశ్వర రెడ్డి, కశిరెడ్డి వెంకట కోటిరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, బీరం భాస్కరరెడ్డి, బాలిరెడ్డి పాల్గొన్నారు.



చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

శారదా పీఠాధిపతిని కలిసిన గణపవరం భారతీస్వామి



నాదెండ్ల: గణపవరం శివప్రియనగర్‌లో ఉన్న ఆదిపరాశక్తి దేవాలయ పీఠాధిపతి శ్రీ నిత్యవిద్యానంద భారతీస్వామి దక్షిణ భారత యాత్రను ప్రారంభించారు. ముందుగా విశాఖపట్నంలోని శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా మహాభిక్షాటన వివరాలను స్వామీజీకి వివరించారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు తాను దక్షిణ భారతదేశ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. ఏపీలో శ్రీకాకుళం పలాస నుంచి చిత్తూరు జిల్లా వరకూ ప్రముఖ హిందూ దేవాలయాలను సందర్శించనున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం ఏర్పడినా పాలకులు హిందూ ధర్మ పరిరక్షణకు సహాయ సహకారాలు అందించాలని కోరనున్నట్లు చెప్పారు. గోమాత సంరక్షణ, అన్యమత ప్రచార నివారణ, ఆలయాల పునరుద్ధరణ తన లక్ష్యాలుగా యాత్ర చేపట్టినట్లు వివరించారు. ఆయనతో పాటూ శిష్య బృందం పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

యడ్లపాడు: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు – అందరికీ ఇళ్లు' పథకాన్ని అమల్లోకి తెచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో లేఅవుట్లను వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. జగనన్న కాలనీలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఇంటి నిర్మాణాలకు హౌసింగ్ లోన్లతో పాటు ఇంటి నిర్మాణానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా బహిరంగ మార్కెట్‌లో కంటే తక్కువకే గృహనిర్మాణానికి అవసరమైన సిమెంట్లు, కంకర, ఇతరేత్ర వాటిని ఇప్పించారు. ఇక ఇసుక అయితే ఉచితంగా అందించారు. అంతటితో ఆగకుండా ఆ స్థలాలపై పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ తాజాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నెల మొదటి వారం నుంచి మండలంలోని అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు షురు చేశారు. మండలం పరిధిలోని 12 సచివాలయ పరిధిలో కోర్టు వివాదంలో ఉన్న వాటివి మినహా మిగిలిన అన్నింటికీ రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా చేస్తున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో చామంతివారివీధిలోని చెట్ల క్రింద కోతముక్క పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురు జూదరులను అరెస్టు చేశారు. ఎస్సై జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు కొలిశెట్టి లక్ష్మీనారాయణ, గ్రంధి నరసింహారావు, నల్లమోతు శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.5640లను స్వాధీనం చేసుకున్నారు. 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.